# దుష్టబుద్ధి

క్రొత్త ప్రపంచంలో కాలుపెట్టిన తరువాత కొలంబసు, అతని అనుచరులు, వాట్లింగ్ ద్వీపంనుండి బయలుదేరి, క్యూబాదీవి చేరారు. క్రొత్తవారిని చూడాలని, శరీరాలకు రకరకాలయిన రంగులుపూసు కొన్న మనుష్యులు ఎంతోమంది, ఎక్కడికెళ్లినా, వారిచుట్టూ గుమిగూడుతున్నారు. ఆ మానవుల నాగరికత రాతియుగపు నాటిదిగా వున్నది. కృత్రిమత్వం వారిలో యేకోశానా లేదు. ఈ స్పెయిను దేశస్థులకు వారు అతి అల్పజీవులుగా కనిపిస్తున్నారు. వారందరికీ కొలంబసు, బూరాలు, చిన్నచిన్న గంటలు, బహుమానంగా యిచ్చాడు. బూరాలు ఊదుతూ, గంటలు నడుముకు కట్టుకొని ఎగురుతూ గంతులేస్తూ, వారందరూ అంతులేని ఆనందాన్ని అనుభవించారు. కొలంబసు, తాను హిందూదేశానికి పశ్చిమప్రాంతంలో దిగాననుకున్నాడు గనుక వారికి పశ్చిమ ఇండియనులని పేరుపెట్టాడు. వారి శరీరాలు ఎర్రగా రాగిలాగా వున్నవి గనుక రెడ్ ఇండియన్లు అనే పేరు గూడా వచ్చింది.

ఆ మనుషుల ముక్కులకు బంగారు ఆభరణాలున్నయ్. ఆ బంగారం కొలంబసుకు, అతని అనుచరులకు, ఆశను అపరిమితంగా రేకెత్తించింది. వెంటనే "ఆ విలువగల లోహం మీ కెక్కడినుంచి వచ్చింది?" అని అడిగారు. కొలంబసు భాష వారికి తెలియదు. వారి భాషలో యేదో చెప్పుతూ తమకు దక్షిణదిశలో వున్నదని చేత్తో సంజ్ఞ చేశారు. కొలంబసు, దక్షిణదశలోవున్న వారి రాజు, వారికా బంగారాన్ని యిచ్చి వుంటాడని అనుకున్నాడు, వారి భాష తెలీక.

## "ద్వారకా"

మార్కొపోలో అనే అతడు హిందూదేశ సంచారంచేసి తన అనుభవాల నన్నిటిని ఒక పుస్తకంలో వ్రాశాడు. హిందూదేశం బంగారంతో తులదూగుతున్నది. ఆ దేశంలోని రాజులు తమ సుందరభవనాలకు బంగారపు పూత వేయించుకొని వున్నారు అని వ్రాశాడు. కొలంబసు ఆ పుస్తకాన్ని చదివాడు. దక్షిణదిశలో వుండే ధనవంతుడయిన వారి రాజు వారందరికీ యీ బంగారాన్ని బహుమతిగా యిచ్చి వుంటాడని అనుకున్నాడు. లోలోపల వారి సౌభాగ్యానికి అసూయపడ్డాడు.

తన రాకను తెలియజేస్తూ ఆ రాజు దగ్గరకు తాను తనదేశంనుండి తీసుకొని వచ్చిన విలువగల కొన్ని వస్తువులను తన మనుష్యులకు యిచ్చి పంపాడు. వారు తిరిగి తిరిగి దారి దొరక్క బయలుదేరినచోటికే చేరారు.

కొలంబసు ఆ ఎర్ర మనుష్యులను మరల అడిగాడు వారి రాజుగారెక్కడుంటారని. వారు సంజ్ఞలు చేస్తూ "దేశం మధ్యలో చాలా దూరంలో వున్నారు" అని చెప్పారు.

కొలంబసు తానే రాజుగారిదగ్గరికి స్వయంగా బయలుదేరాడు. తనతోపాటు ఏడుగురు పశ్చిమఇండియనులను గూడా రమ్మన్నాడు. వారందుకు అంగీకరించి బయలుదేరారు. కొలంబసు ఆ మనుష్యులకు స్పెయినుభాష నేర్పి, తమ అభిప్రాయాలను యితరులకు వ్యక్తంచేయటానికి వుపయోగపరుచుకునేందుకు - తమకు దారి చూపుతూ రాజుగారిదగ్గరకు తీసుక


రు: 5 లకు రేడియో



ఈ రేడియో విద్యుచ్ఛక్తి, బాటరీ, లేకుండా పనిచేస్తుంది. స్టాకు పరిమితం నేడే వ్రాయండి. రు. 5. పోస్టేజీ అదనం.

American Radio House,
Shaktinagar Delhi-6.

కొనుదార్లు తమ అడ్రెస్ ఇంగ్లీష్ లో వ్రాయాలి

పోయేందుకు-వీలుగా వారిని వెంట రమ్మన్నాడు.

హిస్పానియోలా రేవులో ఓడలు ప్రయాణమయ్యాయి. కొలంబసు ఎక్కిన ఓడలో సమస్తవస్తుసామగ్రి వున్నది. ఎన్నో విలువగల వస్తువు లున్నవి. ఓడలు ప్రయాణం సాగించిన కొద్దిసేపటిలోనే తూర్పుతీరం నుండి కొన్ని నౌకలు వారినిసమీపించాయి. వాటిలోని నావికులుకొలంబసుకుగౌరవపూర్వకంగాఅభివందనం చేశారు. సంతోష సూచకంగా అరిచారు. వారి నాయకుడు "గువాకనాగరి" కొలంబసుకు ఆహ్వానం పంపించాడు. కొలంబసు వారి ఆహ్వానాన్ని అంగీకరించాడు.

క్రొత్త ప్రపంచంలో ప్రజలు, ఇంకా సాంఘిక జీవనానికి పూర్తిగా అలవాటు పడలేదు. వారిలో చాలా మంది దేశద్రిమ్మరులు. చాలా అరుదుగా గ్రామాలు కనిపిస్తయ్. తూర్పుతీరంలో యేర్పడిన గ్రామానికి పెద్ద "గువాకనాగరి" పరదేశీయులు తమ దేశంలోకి అతిథులుగా వచ్చారు. వారిని సత్కరించవలసిన బాధ్యత తమమీద ఉన్నదని అనుకొని గువాకనాగరి కొలంబసుకు ఆహ్వానం పంపించాడు. అంతతో కలిసి తూర్పు దిశలో ప్రయాణం సాగించుతున్నారు.

మార్గమధ్యంలో కొలంబసు ప్రయాణం చేస్తున్న ఓడ ఒక




# ★ దుష్టబుద్ధి ★

నీటిలో మునిగిన రాతికి ఢీకొని బ్రద్ధలయింది. ఈ సమాచారం అతిథుల రాకకోసం ఆత్రుతతో ఎదురుచూస్తున్న గువాకనాగరికి తెలిసింది. వెంటనే అతడు తన పరివారాన్నంతటినీ పోగుజేసి ప్రమాదానికి గురయిన వారందరినీ రక్షించటానికి పంపించాడు పడవలతో.

కొలంబసును, అతడి పరివారాన్ని, అతడి సమస్తవస్తుసంభారాన్ని, సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. గువాకనాగరి, ఆ గ్రామ ప్రజలు-అందరు, కొలంబసు అనుచరులతో సహా సురక్షితంగా ఒడ్డు చేరినందుకు ఎంతో సంతోషించారు. వారందరిని హృదయపూర్వకంగా ఆహ్వానించి తమ గ్రామంలోకి తీసుకపోయారు.

అతిథులకు, వారి వస్తువులకు, వసతులను యేర్పాటు చెయ్యాలి. అన్నీ సక్రమంగా తయారయేసరికి మూడురోజులు పట్టింది ఆ మూడు రోజులు కొలంబసు తన వెంట తెచ్చిన విలువగల సామగ్రులన్నీ సముద్రతీరంలోనే వుండిపోయినయ్. ఎర్ర ఇండియన్లకు కొలంబసు తెచ్చిన ప్రతివస్తువు ఆశ్చర్యాన్ని కలిగించింది. వారిలో కుతూహలాన్ని రేకెత్తించింది. పనికిరాని ఆ వస్తువులన్నీ ఎంతో విలువగలిగినవిగా వారికి కనిపించినయ్. కాని ఆ వస్తువులను చేత్తో ముట్టుకోను గూడా ముట్టుకోలేదు వారు. దూరం నుండి చూచి ఆనందించారు. పగిలిపోయిన ఓడలోంచి ఆ వస్తువులను మారుస్తున్నప్పుడు సయితం వారు నల్లపూసంతటి వస్తువును గూడా ముట్టుకోలేదు. తమకు తెలిసినంత వరకు-తమ విజ్ఞానమంతా వుపయోగించి అతిథులకు నివాసాల నేర్పరచారు. అన్నివిధాలా వారికి సేవ జేశారు.

ప్రతి రోజూ అతిథుల సంతోషం కోసం నాట్యాలూ విందులూ జరిగినయ్ ఒకరోజు సముద్రతీరంలో అతిథుల వినోదార్థం పెద్ద యేర్పాట్లు చేయించాడు గువాకనాగరి. రకరకాలయిన చేపలు, పండ్లు, బంగారపు వస్తువులు కొలంబసుకు బహూకరించాడు. తమవద్ద వున్న విలువగల వస్తువుల నన్నిటిని అతిథుల కిచ్చి సత్కారం చేశారు. గువాకనాగరి, చెవులూ, ముక్కూ, నోరు వున్న పెద్ద బంగారు సముంపట్టాను గవ్వలతోను ఎముకలతోను అలంకరించి కొలంబసుకు స్వయంగా బహూకరించాడు.

తనకు జరిగిన గౌరవానికి ప్రతిఫలంగా కొలంబసు వారందరికి గాజుపూసలు. ఎర్రటోపీలు-పంచిపెట్టాడు. కొలంబసు ఎంత పనికిరాని వస్తువులను తమ కిచ్చినా, వారు ఎంతో భక్తితో వాటిని స్వీకరించి ఆనందించారు. ఆ తెల్ల చర్మాలవారందరూ దేవలోకంలో నుండి దిగివచ్చినవారని వారి అభిప్రాయం.

గువాకనాగరి గ్రామంలో కొలంబసు, అతని అనుచరులు నాలుగు రోజులుండి, ప్రయాణమయినారు. వారిని వదిలి పెట్టటానికి గువాకనాగరి మంచిమనసు ఎంతగానో దుఃఖించింది. అతడు కన్నీరు కార్చాడు. వెళ్ళిపోయే సమయంలో కొలంబసు తలకు కిరీటంలాంటి బంగారపు వస్తువును అలంకరించుకొన్నాడు. మెడకు బంగారు పతకాన్ని అమర్చుకొన్నాడు. కళ్ళ వెంట నీరు కారుస్తూ వారందరికీ వీడ్కోలు యిచ్చాడు.

ఆ అనాగరిక ప్రజల ప్రవర్తన కొలంబసును ముగ్ధుణ్ణి చేసింది. ఎంతగానో సంతోషించాడు. తన యీ అనుభవాన్ని గూర్చి తన దేశపు రాణి ఇసబెల్లాకు యీ విధంగా వ్రాశాడు.

“ఈ ప్రజలు ఇంకా రాతియుగంలోనే వున్నారు. పరాయివారిని సయితం తమలాగే చూస్తారు. ప్రేమిస్తారు. వీరి మాటలు ఎంతో మధురంగా వుంటయ్ ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతారు. దైవసాక్షిగా చెబుతున్నాను మహారాణీ! ప్రపంచంలో ఇంతకంటె మంచి ప్రదేశం లేదు. ఇంతకంటె మంచి ప్రజలు లేరు. వీరిని మంచి రకం బానిసలనుగా తయారు చెయ్యవచ్చు!” ★

---

డా॥ జాన్సన్ రచించిన ఆంగ్ల నిఘంటువును చదివిన మీదట ఒక మహిళామణి ‘జాన్సన్ తన నిఘంటువులో అశ్లీల పదాలు అనేకం వాడా’డని తీవ్రంగా విమర్శించింది.

ఈ విమర్శ విని జాన్సన్ అన్నాడు: “మీరు ప్రత్యేకం అశ్లీల పదాల్ని చూడడం కోసమే నా నిఘంటువు తిరగవేసినట్టుంది.”

---